


## పుష్ప-2 ఎప్పుడొస్తే అప్పుడే పండగ



ఎట్టకేలకు అల్లు అర్జున్, సుకుమార్‌ల మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'పుష్ప 2'కు సంబంధించిన తొలి ప్రెస్‌మీట్ గురువారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సమావేశంలో మైత్రీ అధినేతలు నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్‌లతో పాటు ఈ సినిమాను దేశవ్యాప్తంగా పంపిణీ చేస్తున్న డిస్ట్రిబ్యూటర్లు కూడా పాల్గొన్నారు. 'పుష్ప 2'ను మొదట ప్రకటించినట్టు డిసెంబర్ 6న కాకుండా, ఒకరోజు ముందుగానే.. అంటే.. డిసెంబర్ 5న విడుదల చేయనున్నట్టు ఈ సమావేశంలో నిర్మాతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ రాత్రింబవళ్లూ కష్టపడి ఈ సినిమాకోసం పనిచేస్తున్నారు. బన్నీ బెస్ట్ పర్‌ఫార్మెన్స్ ఇందులో చూస్తారు. అన్ని లక్ష్యాలనూ మా 'పుష్ప-2' అధిగమిస్తుంది. యూఎస్‌లోనూ, ఇక్కడా లాంగ్ వీకెండ్ కలిసొస్తుందనే ఉద్దేశంతోనే ఒకరోజు ముందుగా విడుదల చేస్తున్నాం. అయినా పుష్పరాజ్ ఎప్పుడొస్తే అప్పుడే పండగ' అని నిర్మాతలు ధీమా వ్యక్తం చేశారు. ఇంకా హిందీలో విడుదల చేస్తున్న అనిల్ తడానీ, వెస్ట్ గోదావరి డిస్ట్రిబ్యూటర్ ఎల్వీఆర్, తమిళంలో విడుదల చేస్తున్న ఏజీఎస్ డిస్ట్రిబ్యూటర్ మాలి, మలయాళ పంపిణీదారులు ముకేశ్ మెహతా, కర్ణాటక డిస్ట్రిబ్యూటర్ లక్ష్మీకాంత్ రెడ్డితోపాటు నైజాంలో రిలీజ్ చేస్తున్న మైత్రీ డిస్ట్రిబ్యూటర్ శశి కూడా మాట్లాడారు.

## తలబడితే నీదే దునియా



వరుణ్‌తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'మట్కా'. కరుణ కుమార్ దర్శకుడు. నవంబర్ 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలో రెట్రో స్టైల్‌లో తెరకెక్కించిన రెండో పాటను మేకర్స్ విడుదల చేశారు. 'కూర్చుంటే ఏదీ రాదు.. తలబడితే నీదే దునియా అంతా..' అంటూ భాస్కరభట్ల రాసిన ఈ పాటను జీవీ ప్రకాష్ కుమార్ స్వరపచగా, మనో ఆలపించారు. వరుణ్‌తేజ్ ఈ పాటలో రెట్రోలుక్‌లో స్టైలిష్‌గా కనిపించారు. ఓ సాధారణ యువకుడి అసాధారణ ప్రయాణం నేపథ్యంలో సాగే కథ ఇదని, యథార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కిస్తున్నామని, 1980-90 దశకంలో కథ నడుస్తుందని మేకర్స్ తెలిపారు. నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి, నవీన్‌చంద్ర తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, నిర్మాతలు: విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: కరుణ కుమార్.



## ఓ వారియర్ కథ

'తెలుగు ప్రేక్షకులతో నా బంధం ప్రత్యేకం. మా రక్తం మీ రక్తం వేరుకాదు. మనమంతా ఒక్కటే. రీసెంట్‌గా నా రీరిలీజ్ మూవీ 'సూర్య సన్నాఫ్ కృష్ణన్'ని మీరు ఆదరించిన తీరుకు నా కళ్లు చెమ్మగిల్లాయి' అన్నారు సూర్య. ఆయన కథానాయకుడిగా రూపొందిన పాన్ ఇండియా చిత్రం 'కంగువా'. శివ దర్శకుడు. జ్ఞానవేల్‌రాజా నిర్మాత. ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ గురువారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా సూర్య మాట్లాడుతూ 'గతంలో మీరు చూడని అనుభూతిని పొందుతారు. దర్శకుడు శివ వన్‌మ్యాన్ ఆర్మీగా పనిచేసి అద్భుతంగా ఈ సినిమా తీశారు. ఆయనతో వర్క్‌ని ప్రతి రోజూ ఎంజాయ్ చేశాను. మీకు అద్భుతమైన అనుభూతినివ్వడానికి రెండేళ్లపాటు కష్టపడి చేసిన సినిమా ఇది. వెట్రి ఛాయాగ్రహణం, దేవిశ్రీప్రసాద్ మ్యూజిక్ సినిమాను మరోస్థాయిలో నిలబెట్టాయి. ఈ సందర్భంగా రీజినల్ ఫిల్మ్‌ని గ్లోబల్ ఫిల్మ్ స్థాయిలో నిలబెట్టిన రాజమౌళిగారికి థాంక్స్ చెబుతున్నాను. ఇది రీజనల్ ఫిల్మ్ కాదు. ఇండియన్ ఫిల్మ్. తనవారికోసం, తన దేశంలో నిలబడ్డ ఓ వారియర్ కథ ఇది. నవంబర్ 14న వస్తుంది. చూసి ఎంజాయ్ చేయండి' అని అన్నారు. పీరియాడిక్ కథాంశంతో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుందని దర్శకుడు శివ, నిర్మాత జ్ఞానవేల్ పేర్కొన్నారు

## మీనాకుమారి బయోపిక్‌లో?



బాలీవుడ్ ట్రాజెడీ క్వీన్ మీనా కుమారి జీవిత కథ ఆధారంగా దర్శకుడు సిద్ధార్థ్ పి మల్హోత్రా 'కమల్ ఔర్ మీనా' పేరుతో ఓ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నాడు. హిందీ కవి, దర్శకుడు కమల్ అమ్రోహితో మీనా కుమారి ప్రేమాయణం మొదలుకొని వారి విఫల దాంపత్య జీవితం వరకు జరిగిన ఆసక్తికరమైన సంఘటనలతో ఈ సినిమాను రూపొందించబోతున్నారు. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా త్వరలో సెట్స్‌మీదకు వెళ్లనుంది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో కియారా అద్వాణీ కథానాయికగా నటించనుందని తెలిసింది. ఇటీవల కాలంలో దర్శకుడు సిద్ధార్థ్ పి మల్హోత్రా సోషల్‌మీడియా పోస్ట్‌లకు వరుసగా స్పందిస్తున్నది కియారా అద్వాణీ. ముఖ్యంగా ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్ మొదలుకొని వివిధ ప్రచార చిత్రాలు అద్భుతమంటూ ప్రశంసించింది. ఈ నేపథ్యంలో మీనా కుమారి పాత్రలో కియారా అద్వాణీ నటించడం దాదాపు ఖాయమైందని, చిత్ర బృందం సైతం ఇప్పటికే ఆమెతో చర్చలు జరిపాయని బాలీవుడ్ సినీ వర్గాల్లో వినిపిస్తున్నది.

## హాలీవుడ్ రేంజ్‌లో ఇంట్రడక్షన్



ఎన్టీఆర్ బాలీవుడ్‌లోకి నేరుగా ఎంట్రీ ఇస్తున్న చిత్రం 'వార్ 2'. హృతిక్ రోషన్‌తో కలిసి ఆయన నటిస్తున్న ఈ మల్టీస్టారర్ వచ్చే ఏడాది ఆగస్ట్ 14న విడుదల కానుంది. ఇందులో ఎన్టీఆర్ పాత్ర ఎలా ఉండబోతున్నది అనే విషయంపై దక్షిణాది ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొని ఉంది. తాజాగా ఇందులో తారక్ ఇంట్రడక్షన్ సీన్ గురించి బీటౌన్‌లో ఓ ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతున్నది. వివరాల్లోకెళ్తే.. పైరేట్ తరహా థీమ్‌తో తారక్ ఇంట్రడక్షన్ సీన్‌ని దర్శకుడు అయాన్ ముఖర్జీ ప్లాన్ చేశారట. ఈ సీన్‌లో యాక్షన్ డోస్ కూడా భారీగా ఉంటుందని తెలుస్తున్నది. తారక్ చేసే ఫైట్స్ హాలీవుడ్ స్థాయిలో ఆడియన్స్‌ని ఆశ్చర్యానికి గురిచేసేలా ఉంటాయట. అలాగే.. హృతిక్‌ని ఎదుర్కొనే సన్నివేశాలు కూడా గూజ్‌బంప్స్ తెప్పిస్తాయని తెలుస్తున్నది. యశ్‌రాజ్ సంస్థ ఇప్పటివరకూ నిర్మించిన స్పై యూనివర్స్‌లో 'వార్ 2' స్పెషల్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు.



## ప్రాసెస్‌ని రివర్స్ చేశారట!

మహేశ్‌బాబు, రాజమౌళి సినిమా ఎప్పుడు మొదలవుతుంది? అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. స్క్రిప్ట్ వర్క్ పూర్తికావచ్చిందని, లొకేషన్ల అన్వేషణ జరుగుతున్నదని, గెటప్స్‌కు సంబంధించిన స్కెచ్‌లు గీస్తున్నారని.. ఇలా రకరకాల వార్తలు మీడియాలో ఎప్పటికప్పుడు వినిపిస్తూనే ఉన్నాయి. అయితే.. అందుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమాకు సంబంధించిన మేజర్ వర్క్ ఇప్పటికే మొదలైందట. వివరాల్లోకెళ్తే.. విజువల్ ఎఫెక్ట్స్‌కి పెద్దపీట వేసే దర్శకుల్లో రాజమౌళి ఒకరని ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. మహేష్‌తో ఆయన చేస్తున్న సినిమాలో కూడా వీఎఫ్ఎక్స్‌దే మేజర్ పార్ట్. మామూలుగా గ్రీన్ మ్యాట్, బ్లూమాట్‌లపై షూటింగ్ పూర్తయ్యాక, వీఎఫ్ఎక్స్ వర్క్ జరుగుతుంది. కానీ ఈ సినిమా కోసం ఈ ప్రాసెస్‌ని రివర్స్ చేశారట రాజమౌళి. ముందు విజువల్ ఎఫెక్ట్స్‌కి సంబంధించిన పనులు పూర్తి చేసి, తర్వాత షూటింగ్ మొదలుపెడతారట. వీఎఫ్ఎక్స్ పూర్తయ్యాక, షూటింగ్ చేసి, రెండింటిని మెర్జ్ చేయడం హాలీవుడ్ తరహా ప్రక్రియ. ఇప్పటికే 40శాతం వీఎఫ్ఎక్స్ వర్క్ పూర్తయిందని ఇన్‌సైడ్ టాక్. దీన్ని బట్టి ఈ సినిమా రాజమౌళి గత చిత్రాల్లా కాకుండా, త్వరగానే పూర్తయ్యే అవకాశం ఉందని తెలుస్తున్నది. డిస్నీ లాంటి హాలీవుడ్ సంస్థలు ఈ సినిమా నిర్మాణంలో భాగస్వామ్యం అవుతున్నట్టు సమాచారం.






## రావణ పాత్రలో నటిస్తున్నా!



బాలీవుడ్ దర్శకుడు నితేష్ తివారి రూపొందిస్తున్న 'రామాయణ' చిత్రంలో తాను రావణుడి పాత్రలో నటిస్తున్నట్లు కన్నడ అగ్ర నటుడు 'కేజీఎఫ్' ఫేమ్ యష్ అధికారికంగా ప్రకటించారు. రావణాసురుడి క్యారెక్టర్‌లో నటించడానికి యష్ సుముఖంగా లేరని బాలీవుడ్ మీడియాలో కొన్ని వార్తలొచ్చాయి. వీటిపై యష్ ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. 'రామాయణ' వంటి డ్రీమ్ ప్రాజెక్ట్స్ కార్యరూపం దాల్చాలంటే అగ్ర హీరోలు స్టార్‌డమ్, ఇమేజ్ పట్టింపులను పక్కనపెట్టి విశాల దృక్పథంతో ఆలోచించాలని చెప్పారు. 'అంత భారీ బడ్జెట్, తారాగణంతో సినిమా తీయడం మామూలు విషయం కాదు. అందుకే ఈ సినిమాలో భాగమవుతున్నా. రావణ పాత్ర నన్ను బాగా ఎక్సైట్ చేసింది. ఆ పాత్రలో డిఫరెంట్ షేడ్స్ కనిపిస్తాయి. ఓ నటుడిగా నన్ను నేను కొత్తగా ఆవిష్కరించుకోవడానికి ఇదొక మంచి అవకాశం' అన్నారు. సాయిపల్లవి, రణబీర్‌కపూర్ సీతారాములుగా నటిస్తున్న ఈ సినిమా కొద్ది మాసాల క్రితమే సెట్స్‌మీదకు వెళ్లింది. ప్రస్తుతం ముంబయిలో చిత్రీకరణ జరుగుతున్నది.







